# తోటమాలి

[కథ]

= శ్రీ ఆచంట జానకిరామ్ =

"నిన్నరాత్రి విపరీతంగా గాలీ, వాన! మొక్కలన్నీ అల్లల్లాడిపోయాయి...ఎల్లా ఓర్చుకోగలిగాయో అంత హంగామా! ...మాధవీలత నేలకు ఒరిగిపోయింది. చిత్రం, ఎన్ని పర్యాయాలు ప్రయత్నించినా తీగ మామిడిమీదికి ప్రాకలేకపోతోంది!..." అనుకుంటున్నాడు తోటమాలి...

"అవును-మావాడే"

తోటమాలి తల మెత్తి చూచాడు! పెద్దమాలి తన తండ్రీ, ప్రక్కనే దేవతాస్త్రీ! ... దేవతాస్త్రీ!! ...

ఇంతట్లోకి నేరేడు చెట్టుదగ్గర లేగదూడ 'అంబా' అనడం విని "ఇప్పుడే వస్తాను" అంటూ వెళ్లిపోయాడు పెద్దమాలి... దేవతాస్త్రీ తోటమాలిని సమీపించింది. అతడు ఆమెకేసి అల్లాగే చూస్తున్నాడు-అనిమేషుడై.

"రాత్రి ఎంత గాలి!" అంది.

తోటమాలి ఉలిక్కిపడ్డాడు. దేవతాస్త్రీకి మన మాటలు వచ్చు!

కాని, తనకు మాటలు రాలేం.

"నాకు భయమేసింది!" అంది.

"భయమెందుకూ?" అందా మనుకున్నాడు. కాని ఆమెకళ్లను చూస్తూ మాటలు మరచిపోయాడు తోటమాలి!

నేలమీద వాలిన తీగను లేవనెత్తుతూ "నిన్నటి గాలికా?...పాపము" అంది.

అతనికి ఈసారి మాటలు వచ్చాయి. "అవును: నిన్నటిగాలికే" అన్నాడు. కాని తన మాటలు తనకే వినబడలేం!!

ఆమె, "ఏదీ! ఈసారి చూద్దాము...ఇటు నించి...ఈ పలవ ఆసరా చేస్తే. ..."

ఇద్దరూ కలసి మాధవీలతను చెట్టు పైకి ఎక్కించారు.

ఈమాత్రానికే అలసిపోయింది ఆమె.

అతిసున్నితమైన వేళ్లకు అంటిన ఇసుకకేసి చూస్తూ ధగధగలాడే అభ్రకపు రేణువును అతని చేతికి అంటించి 'బంగారం!' అంది అబ్బురపాటు అభినయిస్తూ!

తనకు తెలియకుండానే ఫక్కున నవ్వాడు అతను. ఆమే నవ్వింది. ఇద్దరూ కలసి మళ్లీ మళ్లీ నవ్వారు......

"ఆ వాగులో నీళ్లు మంచివేనా?" అంది.

"మేము తాగే నీళ్లే అవి" అన్నాడు.- ఈసారి తన మాటలు తనకు కూడా విన బడ్డాయి.

ఆమె తోవతీయగా ఇద్దరూ వాగుకేసి నడచారు.

*    *    *

ఆమె రాజకుమారి 'ఉషాబాల' అనీ, తోటలన్నా, పువ్వులన్నా తగని సరదా అనీ తర్వాత చెప్పాడు పెద్దమాలి కొడుకుతో.-'బంగారుతల్లి' అన్నాడు పెద్దమాలి.

ప్రతిఉదయం ఉషాబాలా, తనూ కలుసుకుంటూండేవారుఊరిచివరి కొండచెరియలోని ఆ తోటలో. సాయంత్రం పూయడమే అలవాటైన పువ్వులకు వేకువనే మేలుకోవడం నేర్పాడు అతను ఆమెకోసమని...

ఉదయాని కోవింతరకంగా అల్లిఉంచే వాడు దండలు ఆమెకోసమని- తోటమాలి.

*    *    *

ఆకుల సందులనుంచి తోవజేసుకుని వస్తూవున్న ఏటవాలు సూర్యకిరణాలలో వాగుఒడ్డున ఇసుకగూళ్లు కట్టుకునేవారు వారిద్దరూ. ఒకసారి ఇసుకగూడుతో ఆడుకుంటూవుంటే ఆమెచేతి ఉంగరం అతని చేతిలోకి వచ్చింది. అతడు అప్రయత్నంగా ఉంగరాన్ని కళ్లకద్దుకొని ఆమె కివ్వబోయాడు.

రాజకుమారి తోటమాలి వ్రేలిని తొడిగింది వెలలేని పుష్యరాగం తాపిన తన ముద్దుటుంగరము.

*    *    *

ఉంగరంఅందానికి మురిసిపోతూవున్న కొడుకును చూచి ఆసాయంత్రం పెద్దమాలి 'నాయనా' అని యేదో చెప్పబోయాడు. కాని పుష్యరాగపు కాంతిని ప్రతిఫలిస్తూవున్న కొడుకుకన్నులలోని ఉత్సాహం చూచి తలవంచుకు వెళ్లిపోయాడు పెద్దమాలి ఆవుల్ని పాలు పితకడానికి.

రేపు ప్రొద్దునకు ఏయేపువ్వులు విడుస్తాయో చూడడంకోసం పూలచెట్లలోకి వెళ్లాడు తోటమాలి!

గిరు్రన తిరిగిపోయాయి ఋతువులు. సంపెగలు, గోరింటలు, జాజులు, మల్లెలు, మొగలిపువ్వులు, పారిజాతాలు, చామంతులు, బంతిపువ్వులూ—మళ్లా సంపెగలు వచ్చాయి. తోటమాలిఉత్సాహం అతిశయించినకొద్దీ పెద్దమాలి తండ్రిభయం మరింతైంది.

వైశాఖ పౌర్ణమి. కాస్త ఎండ ఎక్కువైనందువల్ల శోషిల్లిన చెట్లన్నీ చంద్రోదయమయ్యేసరికి 'అమ్మయ్య' అంటూ ఆ చల్లదనాన్ని ఆస్వాదిస్తున్నాయి.

వాగు ఒడ్డున కూర్చొని ఈపిడికిటిలో ఇసుక ఆపిడికిటిలో పోసుకుంటూవున్న తోటమాలి వెనుక అందెల చప్పుడు విని అదిరిపడ్డాడు. చంద్రకిరణాలలో పరిచారికముక్కున నత్తు తళుక్కుమంది. అతను లేచి నుంచుని—'ఎవరు?' అన్నాడు. "దేవిగారి సెలవైంది" అంది పరిచారిక. ...దే...వి...గా....రి....సెలవు.....రాజకుమారి తనకోసం కబురు పంపింది.

"దక్షిణపు తలుపు తీసివుంటుంది-అక్కడ నేనుంటాను" అంది పరిచారిక.

వెన్నెల ఆకాశమంతా ఆవరించింది.

తోటలోని పువ్వులన్నీ కోశాడు తోట మాలి—విడిచినవి, విడుస్తూవున్నవి. క్షణంలో కూర్చాడు మనిషిపొడుగున దండ. ఆ వాసనకు నిద్రపోతూవున్న తుమ్మెదలన్నీ లేచాయి—వెన్నెల చూచి మళ్లా నిద్దుర పోయాయి.

దోసిలిలో మాల నుంచుకొని ఎదుట నిలబడ్డ కొడుకును చూచి తండ్రి ఏదో చెప్పబోయాడు. కాని, 'నాయనా' అని ఊరు కున్నాడు...తండ్రి ఏదో చెప్తున్నాడని ఆప్యాయంతో వినాలనుకున్న కొడుకు తండ్రి తలవంచుకోవడం చూచి, మాట్లాడ కుండా కుటీరంలోంచి బయలుదేరాడు. వలపుతొందరలో, ద్వారంవద్ద తల వంచడం మరచిపోయాడు. చూరు ఠంగుమని తలకు తగిలింది.

"దెబ్బ తగిలిందా నాయనా?" అని దగ్గరగా, కంగారుగా పెద్దమాలి..."లేదు నాన్నా" అని త్వరత్వరగా నడిచాడు తోట మాలి......

తోట అవతలి కంచెదాకా, నిద్దర కళ్లతోనే పెంపుడులేడి అతన్ని సాగనం పింది......

ఇంత సేపూ పిండారబోసినట్టు వెన్నెల కాసిన చంద్రుడు తోటమాలి కోటద్వారం చేరేసరికి నల్లమేఘంవెనుక దాక్కున్నాడు. చీకటిలోనే కోటలో ప్రవేశించాడు తోట మాలి—దక్షిణపు వేపునుంచి. పరిచారిక తోవచూపింది.

ఆ నిర్జనప్రదేశంలో అతని గుండెదడదడ తప్ప వేరు శబ్దం లేదు. మొగసాలఅవతల చలువరాతి చప్పరం. ఆ అవతల విశాలమైన మెట్లు. మెట్లపైన ఎడమవేపునుంచి వింత నగిషీతో వేయి స్తంభాల ప్రాకారం. అంతు లేదా అనుకున్న ఆప్రాకారంచివర దీపపు వెలుతురు. కుడివేపుగా పెద్దగది......అగరు వాసన...పొగలేని ధూమపు వాతావరణ.

అవతలవేపు గోడవద్ద కిటికీకి ప్రక్కగా మనిషి నిలువున పెద్ద సెమ్మా!...సంపెంగ నూనె దీపం...నిలువుటద్దం, ఎదుట దేవతా స్త్రీ—కాదు, ఉషాబాల! తాను తెచ్చే దండలు సవరించుకోడంకోసం జడ అల్లు కుంటూంది.

తోటమాలిగుండె ఆగిపోయింది. చూపులు తనవేకాని, అడుగులు తనవి కాదు. ఆమెవెనుకనుంచి ఆమెదగ్గరకు చేర్చాయి ఎవరి పాదములో అతనిని.

ఆమె తిరిగి చూచింది. అపరిమితమైన సంతోషంతో ఆమె గులాబీపెదవులు రవంత విడిపడ్డాయి, లేత తములపాకు ఎడంగా. రెండు చేతులూ ముందుకు చాచి దండ అందుకుంది ... మబ్బుచాటునుంచి వచ్చిన చంద్రుడు వారి నిద్దరినీ ఒక్కక్షణంలో వెన్నెలకాంతిలో ముంచెత్తి మళ్లా మాయమై పోయాడు.

ప్రక్కన తలుపు తెరచిన శబ్దం... దీపాల వెలుతురు...ఎన్నో కంఠాలధ్వని...

రాజమాత! రాకుమారుడు!!

తోటమాలి కదలలేదు.

"ఎవరితను?" అన్న రాజమాతప్రశ్న.

"ఎవరితను?" అని రాకుమారుడు.

దూరాన పరివారపు గుసగుసలు.

తోటమాలి కదలలేదు. ఆమెకన్నుల లోకి అల్లాగే చూస్తున్నాడు.

రాజమాత కూతురుబుజాన చెయి వుంచి మళ్లా అంది: "ఎవరితను?"

"ఎవరు నువ్వు! మాట్లాడవేమి!"— ఎవ రీమాటలు? ఉషాబాలే! ఉషాబాలే బిగ్గరగా: "ఎవరు నువ్వు! ఎవరు నువ్వు!"

"ఎవరు నువ్వు" అని పాలగచ్చంతా ప్రతిధ్వనించింది.—తోటమాలి కదలలేదు.

రాజకుమారుడు ఓఅడుగు ముందుకు వచ్చాడు.

ఉషాబాల చేతిలోని దండను చూచిన రాజమాత వడివడిగా కొడుకుదగ్గరకు వచ్చి అతని చెయ్యి పట్టుకుంది. ఆగంతుకుని వైపు చూచి వెళ్లిపొమ్మని సైగచేసింది.

ఉషాబాల తల వంచుకుంది.

ఇందాకటి నల్ల మేఘం ఇప్పుడు లేదు... చంద్రునిలోని మచ్చమాత్రం వెండిపళ్లెము అంతా ఆవరించింది...

నిద్దురకళ్లతోనే పెంపుడులేడి తోటమాలిని తోటలోకి ఆహ్వానించింది. కొడుకు కోసం తండ్రి మేలుకొనేవున్నాడు...భూమి లోకి కుంచుకుపోతూ వచ్చిన తోటమాలిని తండ్రి సందిటలోకి తీసుకున్నాడు. 'నాయనా' అన్నాడు—ఇక మాట్లాడలేకపోయాడు.

తన తోటలోని పువ్వులన్నీ నిద్రపోతాయి......తన తోటలోని పక్షులన్నీ నిద్రపోతాయి...మేలుకొని మేలుకొని పెంపుడు లేడి అతని పాదాలమీద తలవాల్చి నిద్రపోతుంది...

కాని తోటమాలికిమాత్రం నిద్దురలేదు. ఉదయభానుని చూస్తూ, వజ్రపుటుంగరంతో తన ఎర్రని కళ్లు తుడుచుకుంటాడు, ఇప్పటికీ, ఎప్పటికీని!!—తోటమాలి.

---

# పూజ

**శ్రీ కొంవెల్ల లక్ష్మీనారాయణ**

గంగను నభిషేకకార్యంబుఁ దలపెట్ట నది యెంగిలయ్యె మత్స్యములవలన
చిగురుటాకులఁ దెచ్చి సేవింతు నని యన్నఁ గోకిలమ్ములు వానిఁ గొరికివేసె
పుష్పజాతులఁ దెచ్చి పూజసేతు నటన్నఁ గొదమతుమ్మెద మున్నె గ్రోలె మధువు
ముదముతో ఫలముల నిదె తెత్తు నని యన్న మున్ముందె రుచిజూచె మొనసి చిలుక
సరవి ప్రేమాంబువుల నిన్ను జలకమార్చి - భక్తిచిగురుల నీ కొక్క పాన్పు గూర్చి
పుణ్యమా వాక్సుమంబులఁ బూజసేసి - హృదయఫలమును హరి! నీకు పదిలపరతు.